

# ఇండస్ట్రీ

సుబ్బిగాడు ఈ మధ్య ఎవరితోనో గానీ అన్నాట్ట, నేను వాడికి తిరుక్షవరం చేశానని. నమ్మకండి, పచ్చి అబద్ధం.

అమాటకొస్తే నాచేత గౌరిగించుకునేందుకు వాడిదగ్గరేముంది గనుక. పాతికేళ్ళకే జీవితాన్ని శుభ్రంగా క్షవరం చేయించుకున్న వాడికి అదనంగా నేను చేసేందుకేముంటుంది చెప్పండి!

సంగతేమంటే, వాడో బుల్లి నక్సలైటు. నక్సలైట్లకు దేశభక్తి ఉండదని మీకు నేను గుర్తు చేయనక్కర్లేదుగదా!

నా ఖర్మకొద్దీ సుబ్బిగాడిది సరిగ్గా మా ఎదురిల్లే. మూడేళ్ళుగా వాడు నిరుద్యోగిగా, నేను ఉద్యోగిగా ఉంటున్నప్పటికీ అంతకుముందు మాత్రం మే మిద్దరం క్లాస్‌మేట్లం. ఒకే బస్సులో, కాలేజీకెళ్ళి వస్తూ, అడపాదడపా ఒకే హోటల్లో ఒకే టేబిల్ ముందు కూర్చుని ఒన్ బై టూ కాఫీలు సేవించిన దోస్తులం.

అయితే, కాలేజీలో మాత్రం వాడి దోస్తులువేరు. వాళ్ళ కబుర్లు వేరు. వాళ్ళకి పాఠాల మీదకన్నా పత్రికల మీద శ్రద్ధ ఎక్కువ. క్లాస్‌లో లెక్చర్ల మీద కన్నా రాజకీయ లెక్చెర్ల మీద మక్కువ ఎక్కువ.

అసలు సుబ్బిగాడిలా పాడైపోవటానికి కారణం ఆ దోస్తులేనని నా అనుమానం.

ఇద్దరం కలసి చదివాం. ప్యాసయ్యాం. ఇంక చదివేందు కేం లేదు గనుక ఉద్యోగాన్వేషణలోకి దిగాం. అక్కడే వచ్చింది అసలు గొడవ.

మా బాబు కాస్త ఉన్నవాడు. నా ఉద్యోగం కోసం ఓ పదివేలు తేలిగ్గా పెట్టుబడి పెట్టగలిగాడు. ఫలితంగా పరీక్ష ప్యాసయినట్లు తెలిసిన మూడు నెలల్లోగా ఉద్యోగినయిపోయాను. వెధవది; పదివేలు పోతే పోయింది. మూడునెలల జీతం గదా! అదొచ్చి ఇప్పటికి మూడేళ్ళుగా నేను ఉద్యోగం చేయటం లేదా! ఆ ఉద్యోగమే లేకుంటే నా మొఖానికి పాతిక లక్షల కట్నంతో పిల్ల నిచ్చేందుకు ఎవడు ముందుకు వచ్చేవాడు చెప్పండి.

నేనో దారిన పడగానే మనవాడేగదా అని సుబ్బిగాడి క్కూడా ఓ ఉద్యోగం వెతికాను. జీతం వెయ్యిన్నరే అయినా వాళ్ళుకూడా పది వేలు ముడుపు అడిగారు.

వెయ్యిన్నర ఉద్యోగానికీ, మూడున్నరవేల ఉద్యోగానికీ కూడా ముడుపు సమానమేనా! అని

ఆశ్చర్య పోతున్నారా? అందులో కాస్త లిటిగేష నుందిలెండి. మా బాబు డబ్బుతోపాటు కాస్త పలుకుబడి కూడా ఉన్నవాడు. కనుక, నాకు ముడుపులో కన్సెషన్ దొరకటం సహజం.

సుబ్బిగాడి ఫాదర్ ఓ బక్క ఎన్జీవో. ఆయన దగ్గర డబ్బూ లేదు ఇన్ఫ్లుయెన్సూ లేదు, అప్పులు తప్ప మరేం లేవు.

అయినా పదివేలు ఏమంత పెద్ద మొత్తం చెప్పండి. నా దగ్గర పదివేలు పుచ్చుకుని ఆర్డర్స్ వేయించిన పెద్దమనిషి ఆయనగారి ముండల సంగతలా ఉంచి బ్రాందీబుడ్లకే నెలకో అయిదారు వేలు ఊదేస్తాడట. మనవాడి సంగతికొచ్చినా ఓ ఆర్నెల్ల జీతమేగదా!

ఆ ఆర్నెల్లూ అప్రెంటెస్‌గా పని చేశామనుకుంటే పోదూ!

కాని, సుబ్బిగాడు నా మాట విన్నాడుకాదు. "పదివేలే? మా బాబు నిప్పుడు మర్డర్ చేస్తే తప్ప నాకు పది వేలు వచ్చేదారి లేదు!" అని వాపోయాడు వాడు.

వాడి ఫాదర్ ఎప్పుడో కాస్త బాగున్న రోజుల్లో పదివేలకు ఇన్సూరు చేశాట్ట, అది తప్ప వాళ్ళకు మరేం రావాల్సింది లేదట. ఇవ్వాల్సింది మాత్రం చాలా ఉందిట!

"మీ ఫాదర్ని మర్డర్ చేస్తే పది వేలొస్తాయి నిజమే! కానీ, ఆయనగారికి ఉన్న గవర్న మెంటు నౌకరీ ఊడిపోతుంది గదా! మర్డర్ కేసులో జైలుకువెళ్ళి వచ్చేదాకా నీ కోసం ఈ ఉద్యోగం ఖాళీగా ఉంచరు గదా!" అన్నాన్నేను.

వాడు వెర్రిగా దిక్కులు చూసేడు. ముందు నన్నే మర్డర్ చేస్తాడేమోనని నాకు భయం వేసిన మాట నిజం.

ఆతర్వాత వాడి ఉద్యోగం గురించి నేనంతగా పట్టించుకోలేదు. అడపాదడపా మరెవరూ తోడు దొరకనప్పుడు వాడిని సినిమాలకో, షికార్లకో తీసుకుపోతుండేవాడి నంతే. గాంధీగారు చెప్పారుగదండీ? "నీకున్న దాంట్లో కాస్త లేనివాడికి ముష్టివేస్తూ ఉండు. వాడు కనీసం ఊపి రితోనైనా బ్రతికిఉండేలా చూడు. లేకుంటే వాడు నీమీదే తిరగబడి, నీవు కష్టపడి పేర్చుకుం టూన్న బ్యాంకు బ్యాలెన్సుల్ని సఫా చేయగలడు!" అని!

అయినా సుబ్బిగాడి కేమన్నా విశ్వాసం ఉంటేనా! గాంధీగార్ని చెడ తిట్టేవాడు. ఆయనో తెలివైన కేటు అంటూ దారుణంగా గర్జించేవాడు. దేశంకోసం కాదు, దేశాన్ని రాబందులకూ, తోడేళ్ళకూ అప్పగించేందుకే అన్ని త్యాగాలు చేశాడనే వాడు.

నా ఖర్మకొద్దీ చెవులు మూసుకున్నా వినిపించేటంత ఘాటుగా ఉండేవి వాడి ఉపన్యా సాలు.

"తప్పు తమ్ముడూ! మరీ అంత ఘోరంగా ఆలోచించకు! ఆ గాంధీగారి వారసురాలే గదా ఈ గాంధీ కూడా. చూడూ, ఆవిడెన్ని మంచి పనులు చేస్తూందో! నిన్నగాక మొన్ననే గదా! బ్యాంకుల్ని జాతీయం చేసిందావిడ" అన్నానోసారి!

వాడు ఉగ్రుడయ్యేడు, బడా నక్సలైటులా ఫోజు పెట్టేడు, నావంక కొరకొరా చూశేడు. పత పతామని నమిలేసే వాళ్ళా కనుపించాడు, "అవును బ్యాంక్ ఎకౌంట్ ఉన్న వాడివి. నీకు కావాల్సిందే ఆ బ్యాంకుల గొడవ! బుక్కా ఫకీరు గాడిని. నాకు ఒరిగేదేమిటీ? " అన్నాడు వాడు.

నవ్వొచ్చింది నాకు, వాడి అజ్ఞానం చూసి, రోజూ పేపర్లు మాత్రం శ్రద్ధగా చదివే వీడి పరిజ్ఞానం ఇదా, అయినా ఇలాంటి నక్సలైటు గాళ్ళకు వాస్తవాలు సరిగా అర్థం అయి చావ వుగదండీ

"కాదురా సుబ్బారావూ, బ్యాంకుల జాతీయం వల్ల చాలా లాభాలున్నాయి. ఆ పని చేసిం

దసలు నీబోటి ఫకీరు గాళ్ళకోసమే. చూడూ, బ్యాంకులు రిక్షాలకు అప్పులిస్తున్నాయిప్పుడు. రైతుల కిస్తున్నాయి. టాక్సీల వాళ్ళకిస్తున్నాయి. ఇది గరీబీల రాజ్యంరా నాయనా, గరీబీల రాజ్యం! ఈ సంస్కరణలన్నీ నీ బోంట్ల కోసమే" అన్నాన్నేను.

సుబ్బిగాడో మందహాసం చేశేడు. ఎలా ఉందది? గాంధీగారి బోసి నవ్వులా ఉందా? అబ్బే, లేదు, కుర్ర సుబ్బిగాడి కుంక నవ్వులా ఉందది. క్షణకాలం పాటు నాకేసి చురచురా చూశేడు. నా తలకాయను చీల్చుకుని లోపల మెదడులో దేనికోసమో వెతుకు తున్నట్లుగా ఉందా క్రూర, ఘోరచూపు.

"చూడరా సుబ్బారావూ, నీవు టెక్నికల్ కోర్సు చదివిన వాడివి. డిగ్రీ ఉన్నవాడివి. బ్యాంక్ లోన్ తెచ్చుకొని హాయిగా ఏదేనా ఇండస్ట్రీ పెట్టుకోరాదూ" అని సలహా యిచ్చేను.

"నేనా? " ఆ క్షణాన్న వాడిది తెల్లబోయిన మొహమా లేక ఏడుపు మొహమా? అనేది నాకు తెలీలేదు.

"నువ్వే! ఏం, నీ కేం లోటు. తాతా బిర్లాల తాతలు కూడా ఇలా చిన్నచిన్న ఇండస్ట్రీలు పెట్టి పైకొచ్చిన వాళ్ళే. శ్రద్ధగా చేసుకుని పైకి రావాలేగానీ, ఓ పదేళ్ళలో బిర్లాయే స్వయంగా వచ్చి నీకు పాతిక కోట్ల కట్నంతో పిల్లనివ్వడా! మనది శ్రేయోరాజ్యంరా నాయనా! సోషలి జంలో అందరికీ అవకాశాలున్నాయి. ఎవరైనా పైకి రావచ్చు" అన్నాన్నేను.

"అదీ నిజమే, కానీ, పదేళ్ళ నాటికి నా వయస్సు పెరిగి పోతుంది గదా, మరి బిర్లా నాకు పిల్లనిస్తాడంటావా? అసలాయనకి కూతుళ్ళున్నారా? " అని సందేహించాడు వాడు.

వాడి ప్రశ్నలలో సబబుందని పించింది నాకు, అందువల్ల అప్పుడు వాడి వదనంలో కను పించింది చిరునవ్వా? వంకర నవ్వా? అనేది నేనంతగా పట్టించుకోలేదు. ఔరా, సుబ్బిగా, ఎంత వ్యంగ్యంగా మాట్లాడినావురా, ఎంత తెలివిగా నవ్వి నావురా.

ఆ తర్వాత ఓ వారం రోజులపాటు వాడికి నూరిపోసి ఇండస్ట్రియలిస్ట్ అయ్యేందుకు ఒప్పిం చేను. ఆప్లికేషన్ ఫారం దగ్గరుండి పూర్తి చేయించేను. స్వయంగా దగ్గరుండి ఇండస్ట్రీస్ డిపా ర్టుమెంటులో ఇప్పించేను. అక్కడ మా ఫాదర్ స్నేహితులు కొందరు ఆఫీసర్లుంటే వారిలో ఒకరికి మనవాడి సంగతి చెప్పేను. తప్పకుండా వచ్చేలా చేస్తానని ఆయన బల్లగుద్దకుండానే హామీ ఇచ్చేడు. తదుపరి మా కిద్దరికీ కాఫీలు కూడా ఇప్పించేడు.

అప్లికేషన్ తీసుకున్న సూపరింటెండెంట్ కూడా చాలా మంచిగా మాట్లాడేడు. "వెధవది! మరీ పాతిక వేలకు అప్లికేషన్ పెట్టారేమండీ! పాతికవేలతో ఏం ఇండస్ట్రీ పెడతారు? ఇంత వరకూ ఎవరూ ఏభై వేలకు తక్కువకు అప్లికేషన్ పెట్టలేదు!" అన్నాడాయన.

"ప్రస్తుతానికి నాకా పాతిక వేలే పాతిక లక్షలకు సమానంలెండి!" అన్నాడు మా సుబ్బి గాడు! పాపం! అల్ప సంతోషి!

"సరే! ఓ వారంలోగా ఈ అప్లికేషన్లన్నీ స్క్రూటినీ చేసేసి బ్యాంకుల వాళ్లకు రికమెండే షన్తో సహా పంపేస్తాం. మీరు మళ్లీ రానక్కర్లేదు. సరాసరి బ్యాంకుకే ఓ గోనెసంచీ భుజా న్నేసుకుపొండి! అందులో పాతిక వేలూ వేసుకెళ్లండి! అన్నాడు సూపరింటెండెంటు.

ఓ నెల తర్వాత సుబ్బిగాణ్ణడిగేను "ఏంరా! గోనెసంచీ దొరకలేదా? " అని.

"సంచీ రెడీగానే ఉంది! కానీ కాగితాలే కదల్లేదు. అవింకా బ్యాంకుకు చేరనే లేదుట" అన్నాడు వాడు.

సంగతేమంటే ఆ సూపరింటెండెంటుగారు ఓ అయిదొందల రూపాయలడిగేడుట, "మీ డాక్యుమెంట్లన్నీ నాలుగేసి కాపీలు టైపు చేయించాలిప్పుడు! మా టైపిస్టులు బిజీగా ఉన్నారు.

ఓ అయిదొందలిలా పారేయండి! ఈ రాత్రికే ఇద్దర్ని కూచోబెట్టి టైపు చేయిస్తాను. అందరూ అలాగే చేయించుకుంటున్నారు" అన్నాడట ఆయన.

సబబేననిపించింది నాకు. పాపం! మరీబక్క ఎన్జీవో టైపిస్టుగాళ్లు! వాళ్లకు ఆ మాత్రం తినే హక్కులేదా!

అయిదొందలేగదా అని అదేదో నేనే వాడికి అడగకుండానే అప్పు పెట్టేను. అదీగాక వీడు రేపటి ఇండస్ట్రియలిస్టు. బిర్లాకు కాబోయే అల్లుడు. మనకు వాడితో అవసరాలుంటాయి గదండీ!

ఓ ఆర్నెల్లు గడిచిపోయేయి. అడపాదడపా సుబ్బిగాణ్ణి అడుగుతూనే ఉన్నాను. "ఎందాకా వచ్చిందిరా! నీ ఇండస్ట్రీ" అని.

వాడు చాలా చాలా చెప్పేడు. తిరగగా, తిరగ్గా ఇండస్ట్రీస్ వాళ్లు పిలిచి ఇంటర్వ్యూ చేశేర్ట. "నీకు పాతికవేలు అప్పిమ్మని బ్యాంకు వాళ్లకు రికమెండ్ చేస్తాం! సరే! కానీ, రూల్స్ ప్రకారం నువ్వు కూడా కొంతన్నా అడ్వాన్సుగా పెట్టుబడి పెట్టగల ఆర్థికస్తోమతుండాలి. మరి ఓ పది వేలు పెట్టుబడి చూపగలవా? " అని అడిగేరట ఇంటర్వ్యూ చేసినవాళ్లు!

"ఓ! ఉంది. అయితే ముందుగా మా బాబుని మర్డర్ చేయాల్సి ఉంటుంది. ఖూనీలు చేసినవాళ్లకి అప్పులిచ్చేందుకు మీ రూల్సు ఒప్పుకుంటాయా? " అని అడగబోయి, ఎందుకులే వీళ్లతో? అని మానేశాట్ట సుబ్బిగాడు.

వచ్చినప్పటి సంగతిగదా అని "ఓ! ఉంది" అని దబాయించేట్ట.

ఆ తర్వాత బ్యాంకు వాళ్లు మన వాడిని కూర్చోబెట్టి "మీకు లోను శాంక్షన్ చేస్తున్నాం. గోనెసంచీ తెచ్చుకున్నారా? " అని పరామర్శించేరుట.

"లేదు సార్! రేపు గోనెసంచీతో సహా వస్తాను" అన్నాట్ట మనవాడు.

"ఓ యస్! ఆ గోనెసంచీతోపాటు ఓ పాతిక వేలకు సెక్యూరిటీగా ఆస్తిపాస్తులు గానీ, మరేమన్నాగానీ తీసుకురండి!" అన్నార్ట బ్యాంకువాళ్లు.

"అదేమిటండీ!" అని తెల్లబోయేట్ట మనవాడు!

"అవున్నాయనా! నువ్వా పాతికవేలూ పట్టుకెళ్లి ఇండస్ట్రీ పెట్టకుండా గుర్రప్పందాల్లో పెడితే, ఆ తర్వాత అంతా క్షవరం చేయించుకుని సూయిసైడ్ చేసుకుంటే, మేం మా డబ్బు ఎవరి దగ్గర్నుండి ఎలా రాబట్టుకోవాలి" అని ప్రశ్నించేరట బ్యాంకు పెద్దలు.

"నాకు ఇద్దరు ఫాదర్లుంటే అలాగే చేయగలనండీ! కానీ ఒక్కరే ఉన్నారు!" అన్నాడట సుబ్బిగాడు.

ఈసారి వాళ్లు తెల్లబోయేరట.

"మా ఫాదర్ పదిహేనువేలకే ఇన్సూర్ చేశాడండీ! ఇద్దరు ఫాదర్లుంటే బాగుండేదేమో! మీకు సెక్యూరిటీ చూపగలిగే వాడినేమో!" అని లేచి వచ్చేశాడట మనవాడు.

అంతా చెప్పి అన్నాడు వాడు!

"ఈ ఆర్నెల్లూ ఇలా వేస్టయిపోయేయి. ఇహ ఉద్యోగాన్వేషణలో పడాలి. అన్నట్టు మేం ఇల్లు మారుతున్నాం, ఈ సాయంత్రం! చాలా దూరం! ఇహమీదట నీకు ఎక్కువగా కనిపించనేమో!" అన్నాడు వాడు.

"ఎందుకురా, మరీ దూరం పోతున్నారూ? " అనడిగేను.

"ధరలన్నీ మండిపోతున్నాయ్! మా బాబుకొచ్చే జీతంరాళ్లు తిండికే చాలటంలేదు. ఈ పోర్షన్‌ను భరించలేకున్నాం. ఊరి చివర్న కాస్త చవకలో ఓ పెంకుటిల్లు అద్దెకు దొరికింది.

మా ప్రక్క పోర్షన్ వాళ్లు కూడా ఇల్లు ఖాళీ చేస్తున్నారు. అన్నట్టు మీ ఫాదర్ ఈ ఇల్లు కొనేశారట గదా! ఏం చేస్తారేం? " అనడిగాడు.

నిజమే! మా ఫాదర్ లక్షన్నరకు ఈమధ్యే ఆ ఇల్లు కొనేశారు. మరో లక్షన్నర పెట్టి ఆ ఇల్లు బాగుచేయించి అద్దెకిచ్చేద్దామని ప్లాను వేశారు. రేపో ఎల్లుండో పని మొదలవుతుంది. పదిరోజుల్లో పూర్తయిపోతుందంతా.

ఆ తర్వాత సుబ్బిగాడు నాకు మళ్లీ కనపళ్లేదు. వాడి క్రూర ఘోరోపన్యాసాలు వినే అదృష్టం నాకు తగలలేదు.

మా క్రొత్త ఇల్లు బ్రహ్మాండంగా తయారయింది. ఓ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌కు అద్దెకిచ్చేశారు మా ఫాదర్. అందులోని ఓ పోర్షన్‌కే సుబ్బిగాడి ఫాదర్ రెండొందల రూపాయలిచ్చేవాడట! పూర్ ఫెలో! ఇప్పుడక్కడ ఆ పూరిపాకకు ఎంతిస్తున్నాడో!

హాయిగా ఉంది జీవితం. ఈమధ్యే నాకో ఇంక్రిమెంటొచ్చింది. మా ఫాదర్ నాకో స్కూటర్ కొనిపెట్టేరు. అడపాదడపా ఏవేవో కాయితాల మీద సంతకాలెట్టించుకునేవారు. మనకెందుకండీ పెద్దవాళ్ల వ్యవహారాల వివరాలు. నేను కళ్లు మూసుకుని పెట్టమన్న చోట పెట్టేవాడిని, అంతే!

ఓ మిత్రుడి పెళ్లి ఫంక్షన్లో మా సుబ్బిగాడికి చాలా హెల్ప్ చేసిన ఆ ఇండస్ట్రీస్ డిపార్టుమెంటులోని మా ఫాదర్ స్నేహితుడైన ఆఫీసర్ కనిపించి పలకరించేరు.

కుశల ప్రశ్నలయ్యాక అడిగారు! "ఎలా ఉందోయ్ నీ ఇండస్ట్రీ? " అని.

నాకేం అర్థం కాలేదు. "ఇండస్ట్రీ ఏమిటండీ? " అని తెల్లబోయేను.

"ఫోజులు కొట్టకోయ్! మా ద్వారా లక్షన్నర లోన్ కొట్టుకెళ్లి మమ్మల్నే దబాయిస్తున్నావే? " అన్నారాయన.

మెరుపు మెరిసినట్లయింది. నా అజ్ఞానం మీద ఓ పిడుగు పడ్డట్టయ్యింది. మా ఫాదర్ నాచేత చేయించిన సంతకాలు గుర్తుకొచ్చాయి. నెలకో రెండువేలు అద్దె తెస్తున్న ఇల్లు గుర్తుకొచ్చింది. బయట ఉన్న నా స్కూటర్ జ్ఞాపకమొచ్చింది.

"ఓ! అదా పూర్తయిందండీ! బాగానే నడుస్తున్నదండీ!" అని నసిగేను.

ఆయనగారు మందహాసం చేసేరు. చేసి, వీపు తట్టేరు.

అదీ సంగతి! ఇప్పుడు చెప్పండి! సుబ్బిగాడికి నేను చేసిన క్షవరం ఏముందిందులో!

పైగా అయిదొందల రూపాయలు ఉదారంగా అప్పిచ్చానే!

*(1967)*

☆